క్లుప్తంగా

ప్రతీరోజు బయోమెట్రిక్ హాజరు వేయాలి



బయోమెట్రిక్ యంత్రాన్ని పరిశీలిస్తున్న ఆదే ప్రకాశ్

కెరమెరి: బయోమెట్రిక్ యంత్రంలో ఉపాధ్యాయులు ప్రతిరోజు హాజరు వేయాలని మండల ప్రత్యేకాధికారి ఆదే ప్రకాశ్ అన్నారు. శనివారం మండలంలోని గోండ్‌ఝరి, బారేమోడి ప్రభుత్వ పాఠశాలలను ఆయన సందర్శించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును, తొలిమెట్టు కొనసాగుతున్న విధానాన్ని పరిశీలించారు.

మెగా వైద్యశిబిరం సద్వినియోగం చేసుకోవాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నార్నూర్: ఈ నెల 6న జైనూర్ మార్కెట్ యార్డులో నిర్వహిస్తున్న మెగా వైద్య శిబిరాన్ని విజయవంతం చేయాలని జిల్లా గ్రంథాలయ చైర్మన్ కనక యాదవ్‌రావు, రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు ఇంతియాజ్‌లాల పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి తనయుడు కోవ సాయితో కలిసి పోస్టర్లు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ కోవ లక్ష్మి జన్మదినం పురస్కరించుకుని కోవ లక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జైనూర్‌లో 6న మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. సహకార సంఘం చైర్మన్ కొడప హన్నుపటేల్, సర్పంచ్ పార్వతిలక్ష్మణ్, మాడవి భీంరావు, ఎంపీటీసీ భగవంతరావు, నాయకులు మెస్రం అంబాజీరావు, జాడి రవీందర్ ఉన్నారు.

ఉపాధి పనులు పకడ్బందీగా చేపట్టాలి



ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో

కెరమెరి: ఉపాధిహామీ పనులను పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీవో సత్యనారాయణ అన్నారు. శనివారం మండలంలోని కెస్లాగూడ, సుర్దాపూర్ గ్రామాల్లో కొనసాగుతున్న పనులను ఆయన పరిశీలించారు. ఉపాధి కూలీలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఉదయం, సాయంకాలం పనులు చేస్తున్న కూలీల ఫొటోలు యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఎఫ్ఏలకు సూచించారు. అనంతరం ఆయా గ్రామ పంచాయతీల్లో కొనసాగుతున్న నర్సరీలను పరిశీలించారు. ఆయన వెంట ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, ఎఫ్ఏ సోమయ్య తదితరులు ఉన్నారు.

విద్యార్థుల క్షేత్రస్థాయి పర్యటన



పర్యటనలో పాల్గొన్న విద్యార్థులు

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని సైన్స్ విద్యార్థులు వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శనివారం కోసిని చెరువును సందర్శించారు. కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మి నరసింహం మాట్లాడుతూ క్షేత్రస్థాయి పర్యటనల వల్ల విద్యార్థులకు ప్రత్యక్షంగా విషయాలు తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

దూడల ఆరోగ్యంపై దృష్టి



దూడకు టీకా వేస్తున్న పశువైద్య సిబ్బంది

కౌటాల: దూడల ఆరోగ్యంపై పశుపోషకులు, రైతులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పశు సంవర్థక శాఖ అధికారి సురేష్ అన్నారు. కౌటాల పశువైద్యశాల ఆధ్వర్యంలో శనివారం మండలంలోని మొగడ్‌దగడ్ గ్రామంలో దూడలకు బ్రూసెల్లోసిస్ వ్యాధి నివారణ టీకాలు వేశారు. కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. దూడలకు టీకాలు వేయడంతో గర్భకోశ వ్యాధులు రావన్నారు. 4 నుంచి 8 నెలల వయస్సు గల ఆవు, గేదె దూడలకు టీకాలు వేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉర్వత్ జీజాబాయ్, పశువైద్యాధికారి శ్రీకాంత్, ఉప సర్పంచ్ కల్పన, సిబ్బంది సందీప్, రాజన్న, ప్రకాశ్, బిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా కల్యాణం

కల్యాణ మహోత్సవానికి హాజరైన భక్తులు



దర్శించుకుంటున్న అడిషనల్ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్



కల్యాణంలో పాల్గొన్న సీఐ నరేందర్ దంపతులు, ఎస్సై భూమేశ్ దంపతులు





ఆలయానికి వస్తున్న అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్

గంగాపూర్‌లోని శ్రీ బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం బాలాజీ వేంకటేశ్వర స్వామి, అలివేలు మంగ, పద్మావతి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు ఘనంగా కల్యాణం జరిపించారు. ఈ ఉత్సవంలో రెబ్బెన సీఐ అల్లం నరేందర్ దంపతులు, తహసీల్దార్ ఈర్ల మల్లికార్జున్ దంపతులు, ఎస్సై భూమేష్ దంపతులు, ఎంపీపీ జుమ్మిడి సౌందర్య ఆనంద్ దంపతులు పాల్గొన్నారు. టీటీడీ నుంచి వచ్చిన పట్టువస్త్రాలను ఆసిఫాబాద్ డీఎస్పీ శ్రీనివాస్ స్వామి వారికి సమర్పించారు. అదనపు కలెక్టర్లు చాహత్ బాజ్‌పాయ్, రాజేశం స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం రథోత్సవం నిర్వహించనున్నారు. – రెబ్బెన



కల్యాణం జరిపిస్తున్న వేద పండితులు



టీటీడీ నుంచి వచ్చిన తలంబ్రాలు తీసుకొస్తున్న డీఎస్పీ శ్రీనివాస్



ఉత్సవ విగ్రహాన్ని కల్యాణ మండపానికి తీసుకొస్తున్న అర్చకులు

ముగిసిన మినీ మేడారం జాతర

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని నందిగూడ గ్రామ శివారులో నాలుగు రోజుల పాటు కొనసాగిన మినీ మేడారం జాతర శనివారంతో ముగిసింది. కాగజ్‌నగర్ పట్టణంతో పాటు పరిసర గ్రామాల భక్తులు భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కాగజ్‌నగర్‌రూరల్ ఎస్సై సోనియా ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

వందరోజుల పని కల్పించాలి

కాగజ్‌నగర్‌రూరల్: ఉపాధిహామీ పథకంలో కూలీలకు వంద రోజులు పని కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో ఫీల్డ్ అసిస్టెంట్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పని ప్రదేశాల నుంచి కూలీల హాజరును ఎన్ఎంఎంఎస్ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

కౌటాల: వాహనదారులు నిబంధనలు పాటించాలని ఎస్సై ప్రవీణ్‌కుమార్ అన్నారు. శనివారం రాత్రి కౌటాల– బెజ్జూర్ ప్రధాన రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపొద్దన్నారు. డ్రైవింగ్ లైసెన్స్, వాహనాల పత్రాలు వెంట ఉంచుకోవాలని తెలిపారు. తనిఖీల్లో పోలీసులు పాల్గొన్నారు.

టేక్ ‘డై’ వర్షన్..!

- నత్తనడకన నాలుగు వరుసల రహదారి పనులు
- పనులు పూర్తయిన చోట తొలగించని దారి మళ్లింపు బోర్డులు
- రోడ్డు ప్రమాదాలతో ప్రాణాలు కోల్పోతున్న జనాలు
- రెండు నెలల వ్యవధిలోనే ముగ్గురు మృత్యువాత



బంబార సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కన్నయ్య(ఫైల్)

వాంకిడి: మండల కేంద్రం గుండా నిర్మిస్తున్న నాలుగు వరుసల రహదారి పనుల్లో అధికారులు అవలంభిస్తున్న నిర్లక్ష్య వైఖరి ప్రజల పాలిట శాపంలా మారుతుంది. మంచిర్యాల జిల్లా నుంచి మండలంలోని మహారాష్ట్ర సరిహద్దు గ్రామం గోయెగాం వరకు నిర్మిస్తున్న నాలుగు వరుసల రహదారి –363 పనులు ప్రారంభమైనప్పటి నుంచి వాహనదారులు తరుచూ ప్రమాదాలకు గురవుతున్నారు. రహదారి నిర్మాణంలో చేస్తున్న జాప్యం, నిర్లక్ష్యం వల్లే వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని మండలవాసులు ఆరోపిస్తున్నారు. మండల కేంద్రం నుంచి గోయెగాం గ్రామం వరకు రెండు నెలల వ్యవధిలోనే పదుల సంఖ్యలో రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఈ ప్రమాదాల్లో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా పలువురు తీవ్ర గాయాలబారిన పడ్డారు. సంబంధిత అధికారులు సైతం గుత్తేదారు ఇష్టానికి వదిలేయడంతో పనులు నత్తనడకన సాగుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనికి తోడు పనులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో ప్రజల ప్రాణాలకు గ్యారెంటీ లేకుండా పోతోంది.

పనులు పూర్తయినా తొలగించని బోర్డులు..

రహదారి పనుల్లో భాగంగా ఒక వైపు నిర్మాణ పనులు పూర్తయిన తర్వాత మరో వైపు పనులు చేపడుతూ వస్తున్నారు. రహదారి నిర్మాణం జరుగుతున్న వైపు టేక్ డైవర్షన్ బోర్డులు పెట్టి పనులు చేయాల్సి ఉంటుంది. రోడ్డు పనులు పూర్తయ్యాక వాహనదారులు ప్రమాదాల బారిన పడకుండా ఇరు వైపులా రాకపోకలకు అనుమతులు ఇచ్చినట్లు బోర్డులు తొలగించాల్సి ఉంటుంది. కాని ఇక్కడ గుత్తేదారు నిర్లక్ష్యంతో రోడ్డు పనులు పూర్తయినా బోర్డులు మాత్రం తొలగించలేదు. దీంతో వాహనదారులు తరుచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. మండల కేంద్రం నుంచి బంబార గ్రామం వరకు ఇరువైపులా రహదారి నిర్మాణ పనులు పూర్తయినా ట్రాఫిక్ డైవర్షన్ బోర్డులు తొలగించకపోవడంతో ఒక వైపు నుంచి మాత్రమే వాహనాల రాకపోకలు జరుగుతున్నాయి. దీంతో మండల కేంద్రం నుంచి 5కి.మీ దూరం ఉన్న బంబార గ్రామం మధ్యలో రెండు నెలల వ్యవధిలో అత్యధికంగా ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. వాహనదారులు రాత్రుల్లో ఎదురుగా వస్తున్న వాహనాలను గుర్తించలేక పోవడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇప్పటికైనా బోర్డులు తొలగిస్తే ఇరువైపులా రాకపోకలు సాగుతాయని, దీంతో కొంత వరకు ప్రమాదాలు అరికట్టవచ్చని స్థానికులు పేర్కొంటున్నారు.

గత రెండు నెలల్లో సంభవించిన రోడ్డు ప్రమాదాలు..

- ఈ నెల 2వ తేదీన రాత్రి 8 గంటల ప్రాంతంలో మండలంలోని బంబార గ్రామ సమీపంలో మహారాష్ట్రకు చెందిన ఆత్రం కన్నయ్య(42) రెబ్బెన మండలంలో ఓ శుభ కార్యానికి వెళ్లి వస్తూ ఎడ్ల బండికి ఢీకొని మృతి చెందాడు.
- జనవరి 27న మండల కేంద్రానికి చెందిన మత్తడి సునీల్(45) చెక్‌పోస్టు వైపు రాత్రి నడుస్తూ వెళ్తుండగా రహదారిపై ఓ ద్విచక్ర వాహనం ఎదురుగా ఢీ కొట్టడంతో మృతి చెందాడు.
- గతేడాది డిసెంబర్ 8న మహారాష్ట్రకు చెందిన ఓ వ్యక్తి గణేష్‌పూర్ గ్రామం వద్ద కారు ఢీకొని మృతి చెందాడు.
- బంబార గ్రామానికి చెందిన మెంగ్రె సుధాకర్ కిరాణ దుకాణానికి వెళ్లి వస్తుండగా డిసెంబర్ 27 రాత్రి ఓ ద్విచక్ర వాహనదారుడు ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి.
- ఆర్టీవో చెక్‌పోస్టు వద్ద ఆసిఫాబాద్‌కు చెందిన ఎస్‌కె మదర్, భీమయ్య అనే ఇద్దరు వ్యక్తులు జనవరి 14న ప్రమాదానికి గురై తీవ్ర గాయాలపాలయ్యారు.
- ఎంపీడీవో కార్యాలయం, వ్యవసాయ మార్కెట్ చెక్‌పోస్టు, బంబార, మహాగాం గ్రామాల సమీపంలో పదుల సంఖ్యలో చిన్నపాటి రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి.

జాతరకు ముస్తాబైన ఆలయం

దహెగాం: మండలంలోని బీబ్రా గ్రామంలో గల శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర సహిత సద్గురు సాయినాథ దేవాలయం జాతరకు ముస్తాబైంది. ప్రతీ సంవత్సరం మాఘశుద్ధ పౌర్ణమి రోజు జాతర నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీ. ఆదివారం వేంకటేశ్వర స్వామిని ప్రత్యేకంగా అలంకరించి జాతర నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, 6.30 గంటలకు అభిషేకం, 7.30 గంటలకు భక్తుల దర్శనం, మధ్యాహ్నం 12.30 గంటలకు అన్నప్రసాద వితరణ, సాయంత్రం 5 గంటలకు కల్యాణ మహోత్సవం, 6 గంటలకు స్వామివారి పల్లకీసేవ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రాత్రి ప్రత్యేక భజన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.



ముస్తాబైన వేంకటేశ్వర స్వామి ఆలయం

సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీల ధర్నా



సిర్పూర్(టి): ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు



కాగజ్‌నగర్‌టౌన్: ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

సిర్పూర్(టి): అంగన్‌వాడీల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఐసీడీఎస్ సిర్పూర్(టి) ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం బడ్జెట్‌లో అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి కేటాయింపులు పెంచాలన్నారు. మినీ అంగన్‌వాడీ టీచర్లను మెయిన్ టీచర్లుగా గుర్తించాలని, రూ. 26 వేలు కనీస వేతనం ఇవ్వాలని, సీనియార్టీ ప్రకారం ప్రమోషన్లు ఇవ్వాలని తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముంజం శ్రీనివాస్, మండల అధ్యక్షుడు కృష్ణమాచారి, అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ ప్రాజెక్టు అధ్యక్షురాలు ఉమాదేవి, ప్రధాన కార్యదర్శి జీజాబాయి, కోశాధికారి హేమలత, అంగన్‌వాడీ టీచర్లు శ్యామల, హిందూబాయి, మంగళ, శ్రీలత, విమల, అర్చన, సంగీత, అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌టౌన్: అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని శనివారం తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సీడీపీవో సురేఖ రెడ్డికి అందజేశారు. యూనియన్ నాయకులు త్రివేణి పాల్గొన్నారు.

బౌద్ధవిహార నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి

వాంకిడి: మండలంలోని బౌద్ధ విహారాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని శనివారం హైదరాబాద్‌లోని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కార్యాలయంలో సూపరింటెండెంట్ ఆరిఫ్ మహమ్మద్‌కు మండల నాయకులు వినతిపత్రం అందజేశారు. గతంలో మండల కేంద్రంలో బౌద్ధ విహార నిర్మాణానికి రూ.50 లక్షలు, ఖమాన, సరాండి, కనర్గాం గ్రామాలకు రూ.5లక్షల చొప్పున ఎస్సీ అభివృద్ధి శాఖ నిధులు మంజూరు చేసిందని, కాని ఇప్పటి వరకు విడుదల చేయలేదన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో జెడ్పీటీసీ అజయ్‌కుమార్, వాంకిడి సర్పంచ్ తుకారాం, బౌద్ధ మహాసభ ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహోల్కర్, సరాండి సర్పంచ్ కమలాకర్ ఉన్నారు.



సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రతినిధులు

అర్హులకు ఇళ్లు మంజూరు చేయాలి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

కాగజ్‌నగర్‌టౌన్: ఇటీవల చారిగాం రోడ్డులో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అర్హులకు మంజూరు చేయాలని తహసీల్దార్ ప్రమోద్‌కు శనివారం ప్రజాసంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఇంటి స్థలాలు ఉన్న పేదలకు ఇంటి నిర్మాణం కోసం రూ.5లక్షలు మంజూరు చేయాలని కోరారు.

మహిళలకు అండగా ‘సఖీ’

ఆసిఫాబాద్‌రూరల్: మహిళలకు సేవలు అందిస్తూ వారికి అండగా సఖీ ఉంటుందని సఖీ నిర్వాహకురాలు సౌజన్య అన్నారు. శనివారం మండలంలోని కొటగూడ గ్రామంలో సఖీ అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ పని చేసేచోట వేధింపులు, లైంగిక హింస, అక్రమ రవాణ, బాల్య వివాహం, ట్రాఫికింగ్ వంటి సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. మహిళలు రక్షణ కోసం 181కు కాల్ చేయాలన్నారు. సర్పంచ్ లక్ష్మీనారాయణ, కార్యదర్శి తేజ, సఖీ సిబ్బంది మమత, కార్తీక్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న నిర్వాహకురాలు సౌజన్య

పోరాట ఫలితంగానే వేతనాల పెంపు

ఆసిఫాబాద్: ఏఐటీయూసీ పోరాటాల ఫలితంగానే మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాల పెరిగాయని యూనియన్ జిల్లా కార్యదర్శి బోగె ఉపేందర్ ఓ ప్రకటనలో తెలిపారు. తమ యూనియన్ ఆధ్వర్యంలో దశలవారీగా చేసిన పోరాటాల ఫలితంగానే జీవో నంబర్ 08 విడుదలైందని పేర్కొన్నారు. 2022 మార్చి 15న అసెంబ్లీలో మధ్యాహ్న భోజన కార్మికుల వేతనం రూ.వెయ్యికి అదనంగా మరో రూ.2వేలు పెంచుతూ సీఎం కేసీఆర్ ప్రకటన చేశారని తెలిపారు. వీటితో పాటు ఏరియర్స్ కూడా చెల్లించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్‌లో కార్మికుల హక్కుల కోసం ఏఐటీయూసీ పోరాటాలు చేస్తుందని చెప్పారు.

సీఐటీయూ పోరాట ఫలితంగానే..

కాగజ్‌నగర్‌టౌన్: సీఐటీయూ పోరాట ఫలితంగానే మధ్యాహ్న భోజన కార్మికుల వేతనం పెంచుతూ సీఎం కేసీఆర్ ప్రకటన చేశారని జిల్లా ఉపాధ్యక్షుడు ఆనంద్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో అన్ని మండల కేంద్రాల్లో ఈ నెల 6, 7, 8 తేదీల్లో విజయోత్సవ సభలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఐక్యతతోనే ఆలయ అభివృద్ధి

నార్నూర్: ఐక్యతతోనే ఎంపల్లి అంజనేయస్వామి ఆలయ అభివృద్ధి సాధ్యమవుతుందని సర్పంచ్ రాథోడ్ గోవింద్‌నాయక్ అన్నారు. శనివారం గ్రామంలో గ్రామ పెద్దలు, నాయక్ రాములునాయక్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో గ్రామస్తులు సోహన్‌సింగ్, బాబుల్, సురేశ్, సీతారాం, హరిచంద్ పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ



తనిఖీ చేస్తున్న అధికారి హన్మంతు

కౌటాల: మండలంలోని నదిమాబాద్, నాగేపల్లి, తలోడి గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను శనివారం మండల నోడల్ అధికారి హన్మంతు తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. విద్యార్థులు రాయడం, చదవడం తప్పనిసరిగా వచ్చేలా విద్యార్థులపై శ్రద్ధ ఉంచాలన్నారు. ఆయన వెంట సీఆర్పీ దేవన్న, తదితరులు ఉన్నారు.

‘రాష్ట్రంలో అరాచక పాలన’

కాగజ్‌నగర్‌టౌన్: రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతోందని మాజీ ఎంపీ వివేక్ ఆరోపించారు. శనివారం ఆయన పట్టణానికి రాగా స్థానిక మాలమహానాడు భవన నిర్మాణ స్థలం వద్ద మాలమహానాడు జిల్లా, పట్టణ కమిటీల ఆధ్వర్యంలో పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం వివేక్ మాట్లాడుతూ.. కలిసికట్టుగా ఉండి అభివృద్ధి సాధించాలని, సేవా కార్యక్రమాలు నిర్వహించి ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. జిల్లా కమిటీ అధ్యక్షుడు పంబాల సతీశ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాలమహానాడు పదాధికారులు ఎం.సుభాష్, బీ నర్సయ్య, రాజనర్సయ్య, తవిటి తిరుపతి, జూపాక మదన్ తదితరులు పాల్గొన్నారు.



స్థానిక నాయకులతో మాట్లాడుతున్న వివేక్

కష్టపడి చదివితేనే భవిష్యత్

నార్నూర్: విద్యార్థులు కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని గాదిగూడ ఎస్సై ఇమ్రాన్ అన్నారు. శనివారం గాదిగూడ కస్తూరిబా గాంధీ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థినులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.